

# షాక్

వి.వి.సుబ్బరాజు

ఆఫీసరు గారు మంచి కాకమీద వున్నారు!

ఎదురుపడిన వాడినల్లా చెరిగి పారేస్తున్నాడు! చెలరేగిపోతున్నారు! నిన్న ఆయన గారికి ఓ భజన సంఘం వాళ్ళు చేసిన సన్మాన కార్యక్రమానికి స్టాఫ్ ఒక్కరు కూడా హాజరుకాకపోవడం ఆయనకు అవమానకరంగానూ, కోపంగానూ వుంది. ఆ వేడిలోనే రోజూకన్నా ఓ గంటముందు ఆఫీసుకు వచ్చి తెగ రెచ్చిపోతున్నాడు.

ఆదివారంపూట ఆ భజన మనకెందుకని అంతా బద్ధకించేశారు. అదే యిప్పుడు ఆఫీసరు గారి కోపానికి అసలు కారణం అన్న విషయం స్టాఫ్ అందరికీ అర్థమయిపోయింది. 'అదేమీ అఫీషియల్ ప్రోగ్రాం కాదు గదా!? భజన సంఘం వాళ్ళ పిలుపు తప్ప తానుగా మనకేం చెప్పలేదు గదా? మరి అటువంటప్పుడు ఈ ఉరుములు – మెరుపులు దేనికో' అంటూ కాసేపు చెవులు కొరుక్కుని ఎవరి సీటుకు వాళ్ళు అతుక్కుపోయి బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బుద్ధిగా పనిచేస్తున్నట్లుగా నటించేస్తున్నారు.

సీనియర్ క్లర్కు గుర్నాథం యథాతథంగా భుజాన సంచి వేలాడేసుకుని వక్కపొడి నములుకుంటూ ఆలస్యంగా ఆఫీసులోకి అడుగుపెట్టాడు. అటెండెన్స్ రిజిష్టరు అప్పటికే ఆఫీసరు గారి టేబులు మీదికి చేరిపోయిన సంగతి చెవిన వేశారు. గుర్నాథం ఏమాత్రం తొట్రుబాటు లేకుండా సరాసరి ఆఫీసరు గారి గదిలోకి ప్రవేశించాడు.

'అయిపోయింది గుర్నాథం పని!' అనుకున్నారంతా. గుర్నాథానికి తాను సీనియర్‌ననీ, తనను యింతవరకూ ఏ ఆఫీసరూ పల్లెత్తుమాట అనలేదనీ, తాను చెప్పినట్లు విన్నారనీ స్టాఫ్ దగ్గర గొప్పలు పోతూ వుంటాడు.

'ఈరోజు గురుడు పూర్తిగా దొరికిపోయాడు!'

'తల వాచిపోతుంది!'

'ఈ దెబ్బతో అయ్యగారి మిడిసిపాటు వదిలిపోతుంది!'

యిలా రకరకాల కామెంట్స్ చేసుకుంటున్నారు బయట సిబ్బంది.

ఆఫీసరుగారి గదిలోకి గుర్నాథం వెళ్ళిన తరువాత బయట వాళ్ళకు అరుపులు, కేకలు వినిపించాయి.

'పాపం! గుర్నాథం బలయిపోయాడు!' అనుకున్నారు స్టాఫ్. ఆ తరువాత నిశ్శబ్దం!

'బక్కప్రాణికి ఏమయ్యిందో!'

'బహుశా గుర్నాథం ఫెయింట్ అయిపోయి వుంటాడు' అనుకున్నారంతా.

ఓ పావుగంట తరువాత తాపీగా నవ్వుకుంటూ బయటకు వచ్చిన గుర్నాథాన్ని చూసి అవాక్కయ్యారు!

'గుర్నాథానికి మతి చలించలేదుగదా!?'

'ఏమయ్యిందో? ఏమిటో?' అన్న ఆత్రంతో చుట్టుముట్టి –

''ఏమైంది?'' ''ఏమన్నాడు?'' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.

గుర్నాథం చిద్విలాసంగా నవ్వుతూ ''సిగరెట్'' అన్నాడు.

వెంటనే మూడు నాలుగు సిగరెట్లు అతని నోటికి అందుబాటులోకి వచ్చేశాయి. వాటినన్నింటినీ అందుకుని ఓ సిగరెట్ ముట్టించి మిగిలిన వాటిని భుజం సంచిలో భద్రపరచుకున్నాడు. గుండెల నిండా పొగ పీల్చి బయటకు వదులుతూ మళ్ళా నవ్వాడు. చుట్టూ వున్న జనం సస్పెన్స్ భరించలేకపోతున్నారు.

''మెమో యిచ్చాడా?''

ఓ పావుగంట తరువాత తాపీగా నవ్వుకుంటూ బయటకు వచ్చిన గుర్నాథాన్ని చూసి అవాక్కయ్యారు!
'గుర్నాథానికి మతి చలించ లేదుగదా!?'
'ఏమయ్యిందో? ఏమిటో?' అన్న ఆత్రంతో చుట్టుముట్టి –
''ఏమైంది?'' ''ఏమన్నాడు?'' అంటూ ప్రశ్నల వర్షం కురి పించారు.
గుర్నాథం చిద్విలాసంగా నవ్వుతూ ''సిగరెట్'' అన్నాడు.

''సస్పెండ్ చేశాడా?'' అంటూ లోలోపలి ఆనందాన్ని సంబాళించుకుంటూ సింపతీ నటిస్తూ తొందర చేస్తున్నారు. గుర్నాథం సమాధానంకోసం ఆత్రపడుతున్నారు.

''టీ!'' అన్నాడు గుర్నాథం ఊహల్లో తేలిపోతున్నవాడిలా దట్టంగా పొగ వదులుతూ. అటెండరు పక్కనే వున్న ఫ్లాస్కు వంపి టీ గుర్నాథం చేతికి అందించాడు.

'గట్టి షాకే తిన్నాడు గురుడు' అనుకున్నారంతా.

గుర్నాథం టీ సిప్ చేస్తూ, సిగరెట్‌ను మధ్య మధ్య ఆస్వాదిస్తూ తన్మయత్వంలో వున్నాడు.

''లోపల ఏమయ్యిందో చెప్పవయ్యా మగడా! మమ్మల్ని టెన్షన్‌పెట్టి చంపకు!'' హెడ్ క్లర్కు సీతాపతి కసురుకున్నాడు.

''ఏముంది! ఆఫీసు తాను సంభాళించలేకపోతున్నాడట! ఆఫీసులో అంతా పనిదొంగలేనట! పైవాళ్ళకు తాను సంజాయిషీ చెప్పుకోలేక చస్తున్నాడట! నిప్పులు తొక్కిన కోతిలా చిందులు వేస్తున్నాడు!''

''తమరేమన్నారు గురువు గారు!''

''మనకేమన్నా భయమా? సిగ్గా? దర్జాగా నోరు మూసుకుని నిల్చున్నాం!''

''మరి మిమ్మల్నేమన్నాడు!''

''సస్పెండ్ చేస్తానని సరదాపడ్డాడు!''

''చేసేశాడా!''

'అప్పుడు నా సంచీలోంచి నిన్న వాడికి జరిగిన సన్మానం వార్తల తాలూకు పేపరు కటింగులు లామినేషన్ చేయించిన ఫ్రేము వాడి ముందుంచాను. దెబ్బకు గురుడు ఫ్లాటయిపోయాడు!''

''ఆ!!''

''గుర్నాథం నీకు గొప్ప టేస్టుందయ్యా! మంచి ఐడియా! చాలా బావుంది. కూర్చో! కూర్చో!! అంటూ ఒకటే మర్యాదలు. ఉక్కిరిబిక్కిరి చేశాడు''

''నిజంగా అంతే జరిగిందా?''

''అంతేనా అంటే యింకా వుంది! కాస్త కాన్ఫిడెన్షియల్! అయినా మీ మధ్య దాపరికమెందుకు చెప్పేస్తా!''

''చెప్పండి మహాప్రభో.''

''ఒకరిద్దరు పనిదొంగల్ని శంకరగిరి మాన్యాలకు విసిరేస్తేగానీ, మిగిలినవాళ్ళు భయభక్తులతో పనిచేయరట! ఒకటి రెండు పేర్లు చెప్పమని ప్రాధేయపడ్డాడు!''

''నిజమా!? చెప్పేశావా?'' అన్నారంతా కోరస్‌గా.

''లేదు! ఆలోచించి చెబుతానన్నాను'' అన్నాడు గుర్నాథం అందర్నీ పరకాయిస్తూ. యిప్పుడు గుర్నాథం ఎవరికి గురిపెడతాడో అర్థంకాక షాకయ్యి అంతా శిలాప్రతిమల్లా అచేతనంగా వుండిపోయారు.

★

